సాక్షి అనకాపల్లి

మంగళవారం, 12, ఆగస్టు, 2025



తిరంగా... ఘనంగా 8లో

ఎ.కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు హర్ ఘర్ తిరంగా ర్యాలీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు.



ధర్నాలతో దద్దరిల్లిన కలెక్టరేట్

కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం పలు ప్రజా సంఘాలు, రైతుల నిరసనలతో హోరెత్తింది 8లో



దూసుకొచ్చిన మృత్యువు 8లో

నిండు నూరేళ్లు జీవించాల్సిన ఆ తల్లి, మనుమడిని చూసుకున్న సంతోషం మనసులో మెదులుతుండగానే, విధి ఆడిన వింత నాటకానికి బలైపోయింది.

న్యూస్‌రీల్

కేసుల సత్వర దర్యాప్తు అనివార్యం

- సమర్థంగా నూతన సాంకేతిక సేవల వినియోగం
- వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ సిన్హా



జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్లలో సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి : నూతన చట్టాల ప్రకారం కేసుల దర్యాప్తును త్వరగా పూర్తి చేసి, నిందితులను అరెస్టు చేయడం, నిర్ణీత సమయానికి చార్జ్‌షీట్ దాఖలు చేయడం అనివార్యమని ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. తమ కార్యాలయంలో జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్ డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సాంకేతిక సేవల వినియోగంలో భాగంగా 'ఈసాక్ష్య యాప్', ఈ సమన్స్', ఆన్‌లైన్ ఫిర్యాదులు, జీరో ఎఫ్ఐఆర్ వంటి సాంకేతిక విధానాలను పోలీస్‌శాఖ మరింత సమర్థవంతంగా, విస్తృతంగా అమలు చేయాలని ఆయన కోరారు.

నేడు డీవార్మింగ్ మాత్రల పంపిణీ



అనకాపల్లి: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని ఈనెల 12న నిర్వహిస్తున్నట్టు డీఎంఅండ్‌హెచ్‌వో ఎం.హైమావతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అన్ని అంగన్‌వాడీ, ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు కలిగిన విద్యార్థులకు ఉచితంగా నులిపురుగుల నివారణ మాత్రలు వేయడం జరుగుతుందన్నారు. నులిపురుగుల నిర్మూలనకు ఆల్బెండజోల్ మాత్రలను ఉచితంగా పంపిణీ చేస్తున్నామని, 1 సంవత్సరం నుంచి రెండు సంవత్సరాల వయసు గల పిల్లలకు సగం మాత్రను నీటిలో కరిగించి తాగించాలని, రెండు నుంచి 19 సంవత్సరాల వయసు కలిగిన విద్యార్థులకు మాత్రను మధ్యాహ్నం భోజనం చేసిన అరగంట తరువాత చప్పరించేటట్లు వేయడం జరుగుతుందన్నారు.

ఉచితం... ఆర్భాటమే!

- ఇప్పటికే చాలా రూట్లలో బస్సు సర్వీసుల కొరత
- పలు బస్సులు బ్రేక్ డౌన్
- కొత్త బస్సుల ఊసే లేదు..
- స్త్రీ శక్తి పథకం..ప్రచార ఆర్భాటమేనా..
- ప్రయాణికుల్లో ఆందోళన



నర్సీపట్నం కాంప్లెక్స్‌లో ఆర్టీసీ బస్సులు



రాష్ట్ర ప్రభుత్వం స్త్రీశక్తి పథకం అమలు గురించి ఆర్భాటంగా ప్రచారం చేసింది. ఆచరణలో మాత్రం శూన్యం కనపడుతుంది. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కోసం ఉద్దేశించిన ఈ పథకం ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. దీనికోసం డీఎం నుంచి సీఎం వరకు విపరీతంగా ప్రచారం చేస్తున్నారు. సన్నద్ధం అంటూ సన్నాహక సమావేశాలు పెడుతున్నారు. వాస్తవంలో పరిస్థితి దీనికి భిన్నంగా ఉంది. చాలినన్ని బస్సులు లేవు. కొత్త బస్సుల ఊసే లేదు. దీంతో ఈ పథకం ప్రయాణికులకు మరిన్ని కష్టాలు తెచ్చిపెట్టనుందన్న వాదన వినిపిస్తోంది.

నర్సీపట్నం :

అనకాపల్లి జిల్లాలో అనకాపల్లి, నర్సీపట్నంలలో ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. ఈ రెండు డిపోల్లో మొత్తం అన్ని రకాల బస్సులు 204 వరకు ఉన్నాయి. ఈ బస్సులు ప్రస్తుతం జిల్లా ప్రజల రవాణా అవసరాలను తీర్చలేకపోతున్నాయి. ప్రస్తుతం బస్సుల్లో ఆక్యుపెన్సీ రేటు 70 శాతంగా ఉంది. రద్దీ వేళల్లో ఆక్యుపెన్సీ వంద శాతం మించిపోతుంది. గ్రామీణ ప్రాంతాల నుంచి నర్సీపట్నం, అనకాపల్లి, పాయకరావుపేట, యలమంచిలి, చోడవరం తదితర పట్టణాలకు చదువుకు వెళ్లే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ రూట్లల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సులు ఎక్కలేని పరిస్థితి ఉంది. నిత్యం ఎక్కడో ఒక దగ్గర విద్యార్థులు బస్సుల కోసం ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. **స్త్రీశక్తి పథకం ప్రారంభమైతే ప్రస్తుతం ఉన్న ఆక్యుపెన్సీ రేటు మరింత పెరగనుంది. ఈ పెరుగుదలకు అనుగుణంగా** బస్సుల సంఖ్య మాత్రం పెరగడం లేదు. కొత్తగా ఒక్క బస్సును కూడా ఏర్పాటు చేయలేదు. ఇప్పటికే కాలం చెల్లిన బస్సులతోనే ఈ పథకాన్ని నడిపించాలని చూస్తున్నారు. నర్సీపట్నం డిపోలో 106 బస్సులు ఉండగా 93 బస్సులు తిరుగుతున్నాయి. మిగిలిన బస్సులు బ్రేక్ డౌన్‌లో ఉన్నాయి. బ్రేక్ డౌన్‌లో బస్సులను కూడా రోడ్ల మీదకు తెచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ప్రతి బస్సును విరామం లేకుండా తిప్పాలని చూస్తున్నారు. అంతే తప్ప కొత్త బస్సులు ఊసులేదు. ఇప్పటికే అరకొర బస్సులతో ఆగచాట్లు పడుతున్న విద్యార్థులు ఉచిత **ప్రయాణంతో తాము మరింత ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు.**

లేని బస్సులకు ఉచితం..

ప్రభుత్వం పాసింజర్లతో పాటు ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనూ ప్రయాణం ఉచితం అని ప్రకటించింది. అయితే ఈ ఎక్స్‌ప్రెస్ బస్సులు అరకొరగా మాత్రమే ఉన్నాయి. నర్సీపట్నం డిపోలో 12 ఎక్స్‌ప్రెస్ విశాఖపట్నం, చింతపల్లి రూట్లల్లో మాత్రమే తిరుగుతాయి. అనకాపల్లి డిపోలో 4 మాత్రమే ఎక్స్‌ప్రెస్ బస్సులు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో మిగతా డిపోల్లో కూడా ఎక్స్‌ప్రెస్ బస్సుల సంఖ్య చాలా పరిమితం. రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచాలని కోరుతున్నారు. ఎక్స్‌ప్రెస్ వరకే కాకుండా సూపర్ లగ్జరీ, అల్ట్రాడీలక్స్ బస్సులకు కూడా ఉచిత ప్రయాణం కల్పిస్తే ఉపయోగకరంగా ఉంటుందని మహిళలు కోరుతున్నారు.

ఉన్న బస్సులతోనే ఉచిత ప్రయాణం



ప్రస్తుతం జిల్లాలోని రెండు డిపోలలో ఉన్న బస్సులతోనే ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్నాం. అదనపు బస్సులు లేవు. రద్దీని బట్టి బస్సుల ట్రిప్పులను పెంచుతాం. ఉచిత ప్రయాణానికి సంబంధించి కండక్టర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చాం. మరమ్మతులకు గురైన బస్సులు కండిషన్ కూడా మెరుగుపరిచి అందుబాటులోకి తీసుకువచ్చాం. త్వరలో ఎలక్ట్రికల్ బస్సులు వచ్చే అవకాశం ఉంది. ఈ బస్సులు అందుబాటులోకి వస్తే ఉచిత ప్రయాణానికి వెసులుబాటు కలుగుతుంది

–వి. ప్రవీణ, జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి

మహిళల ఉచిత ప్రయాణానికి..	
మొత్తం బస్సులు	181
పల్లె వెలుగు	122
అల్ట్రా పల్లె వెలుగు	15
ఎక్స్‌ప్రెస్‌లు	17
మెట్రో	22
సిటీ ఆర్డినరీ	5

జిల్లాలో డిపోలు	2
మొత్తం బస్సులు	204
ఆర్టీసీ బస్సులు	183
అద్దె బస్సులు..	21

181 బస్సులు.. రోజూ 2 లక్షల మంది ప్రయాణం...

జిల్లాలో మహిళలు, ఐదేళ్ల నుంచి 18 ఏళ్ల **వరకు వయసు గల బాలికలు** మొత్తం **7,38,319 మంది ఉన్నారు.** వీరిలో రోజుకు **సగటున లక్ష నుంచి లక్షన్నర** మంది ఆర్టీసీ **బస్సుల్లో ప్రయాణిస్తున్నట్టు** ప్రజా రవాణా **శాఖ గణాంకాలు చెబుతున్నా**యి. ప్రస్తుతం **పురుష, మహిళల ఆక్యుపెన్సీ** సాధారణంగా **60 –40 శాతంగా ఉండగా,** ఉచిత బస్సు **ప్రయాణం అమలు చేస్తే మహిళల** ఆక్యుపెన్సీ **బాగా పెరిగే అవకాశం ఉంది.** మహిళా ప్రయా**ణికుల సంఖ్య 2 లక్షల వరకు** పెరిగే అవకాశం **ఉంది.**

దీనికి తగ్గట్టుగా బస్సుల సంఖ్య పెరగ**లేదు. నర్సీపట్నం, అనకాపల్లి** డిపోల పరిధిలో **మొత్తం 181 బస్సుల్లో మహిళలకు** ఉచిత **ప్రయాణం అమలు చేయ**సున్నారు. ఉన్న **బస్సులు, సిబ్బందితోనే ప**థకాన్ని అమలు చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఈ పథకాన్ని జిల్లాకే పరిమితం చేస్తే నెలకు రూ.4 కోట్ల చొప్పున ఏడాదికి రూ.48 కోట్లు, రాష్ట్రమంతా అనుమతిస్తే నెలకు రూ.5 కోట్ల చొప్పున ఏడాదికి రూ.60 కోట్లు ఆర్టీసీ ఆదాయాన్ని కోల్పోవలసి వస్తుంది. ఉచిత బస్సుల్లో మహిళల ఆక్యుపెన్సీ బాగా పెరగడం వల్ల రద్దీ దృష్ట్యా పురుష ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించే అవకాశం ఉంది. ఆమేరకు ఆర్టీసీకి ఆదాయం గణనీయంగా తగ్గనుంది.

కదంతొక్కిన గోవాడ రైతులు

- షుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వం ఆదుకోవాలి
- కార్మికులు, రైతుల బకాయిలు చెల్లించాలి
- లేదంటే ఉద్యమం ఉధృతం
- కలెక్టరేట్ వద్ద ఆందోళన



బకాయిలు చెల్లించాలని కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న సుగర్ ఫ్యాక్టరీ రైతులు, కార్మికులు

తుమ్మపాల : గోవాడ చెరకు కర్మాగారం దినదిన గండంగా నడుస్తోందని, వచ్చే సీజన్‌లో ఫ్యాక్టరీ నడుపుతారో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారని, దీనిపై యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని రైతు, కార్మిక నాయకులు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో రైతు, కార్మిక సంఘాలు సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం గోవాడ షుగర్ ఫ్యాక్టరీని ఆదుకోవాలని, రైతులు, కార్మికులకు గత సీజన్‌లో బకాయి పడ్డ రూ.30 కోట్లు వెం**టనే చెల్లించాలని, ఆధునికీకరణకు రూ.100 కోట్లు** మంజూరు చేసి రాష్ట్రంలో ఉన్న ఏకైక సహకార షుగర్ ఫ్యాక్టరీ కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ నెల 9న ఫ్యాక్టరీ వద్ద ఆందోళన చేసిన రైతుల దశల వారి పోరాటంలో భాగంగా కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించామన్నారు. ప్రభుత్వం స్పందిం**చకపోతే భవిష్యత్తులో** ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆందోళనలో రైతు సంఘ నాయకులు తాతారావు, రమణ, ఏరువాక శ్రీనివాసరావు, ఫ్యాక్టరీ కార్మిక రామునాయుడు, సీఐటీయు నాయకులు వి.వి. శ్రీనివాసరావు, గంట శ్రీరామ్, కర్రి అప్పారావు, నాయుడు, గండి నాయనబాబు, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ లోడు క్రమబద్ధీకరణకు రాయితీ



జి.ప్రసాద్, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ, అనకాపల్లి జిల్లా

అనకాపల్లి : గృహాల్లో అదనపు విద్యుత్‌లోడ్‌ను క్రమబద్ధీకరణకు ఈ ఏడాది డిశంబర్ 31వ తేదీ వరకూ ఏపీ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమీషన్ విద్యుత్ వినియోగదారులకు అవకాశం కల్పించిందని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ జి. ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గృహాల్లో అదనపు విద్యుత్‌లోడ్‌ను వినియోగించుకుని విద్యుత్ వినియోగదారులు ఈ ఏడాది మార్చి 1 నుంచి జూన్ 30వ తేదీ వరకూ స్వచ్ఛందంగా 7010 మంది వినియోగదారులు 50శాతం రాయితీని వినియోగించుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

50శాతం రాయితీతో కిలోవాట్‌ను గృహ వినియోగదారులు తగ్గించుకోవచ్చని ఎస్ఈ ప్రసాద్ చెప్పారు.

అదపులోడ్	అసలు ధర	తగ్గింపు ధర
1కిలో వాట్	2250	1250
2కిలో వాట్	4450	2450
3కిలో వాట్	6650	3650
4కిలో వాట్	8850	4850
5కిలో వాట్	11050	6050

మిట్టల్‌పై మోహం ప్రైవేటు దాహం

విశాఖ ఉక్కును ఉద్ధరిస్తామంటూనే.. ప్రైవేటు జపం చేస్తున్న కూటమి సర్కారు

- రాయితీల కోసం దక్షిణాఫ్రికా ప్రభుత్వాన్ని బెదిరిస్తున్న మిట్టల్ స్టీల్స్
- రాయితీలు ఇవ్వకపోతే ప్లాంట్ మూసివేస్తామంటూ హెచ్చరికలు
- ఇక్కడా అదే తరహా బెదిరింపులుంటాయని విమర్శలు
- ఇప్పటికే మిట్టల్ ప్లాంట్‌కు రూ.28 వేల కోట్ల ప్రోత్సాహకాలిచ్చిన కూటమి
- స్టీల్‌ప్లాంట్‌కు తక్షణమే రూ.30 వేల కోట్ల సాయం కోరుతున్న ప్రజాసంఘాలు



సాక్షి, విశాఖపట్నం: విశాఖ ఉక్కు పరిశ్రమను ఉద్ధరిస్తామంటూ ఊదరగొడుతున్న చంద్రబాబు సర్కారు.. ఆ సంస్థను ప్రైవేటుపరం చేసేందుకు కేంద్రానికి పరోక్షంగా సహకరిస్తోంది. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసి తీరుతామని కేంద్ర ప్రభుత్వం తెగేసి చెబుతుండగా.. మరోవైపు ప్లాంట్‌కు కొద్ది దూరంలోనే మిట్టల్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. పరిశ్రమను నిలబెట్టేందుకు రూపాయి కూడా విదల్చని చంద్రబాబు.. మిట్టల్ స్టీల్స్‌పై వ్యామోహంతో ఏకంగా రూ.28 వేల కోట్ల ప్రోత్సాహకాలు అందించడం విస్మయానికి గురి చేస్తోంది. మొదట్లో కొద్దోగొప్పో రాయితీలు అడిగి ఆ తర్వాత ప్రభుత్వం నెత్తినెక్కి కూర్చుంటుంది మిట్టల్ సంస్థ. దక్షిణాఫ్రికాలో ప్లాంట్ ఏర్పాటు చేసి ఇప్పుడు గొం**తెమ్మ కోర్కెలు మిట్టల్ సంస్థ కోరుతోంది. భవిష్యత్తులో ఏపీ పరిస్థితి కూడా ఇలా మారకముందే** మేల్కొనాలని ప్రజాసంఘాలు సూచిస్తున్నాయి. స్టీల్‌ప్లాంట్‌కు పునరుజ్జీవనంపై దృష్టి సారించకుండా మిట్టల్‌కు మోకరిల్లడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.


నాడు ప్రగల్భాలు పలికి..

ఎన్నికల ముందువరకూ ఉక్కు ఉద్యమం సడలనివ్వనంటూ ప్రగల్భాలు పలికిన టీడీపీ, జనసేన నేతలు కూటమి పేరుతో గద్దెనెక్కిన తర్వాత విశాఖ ఉక్కును ముక్కలు చేసేందుకు ఏం చెయ్యాలో అన్నీ చేస్తోంది. ఓ వైపు కేంద్ర గనుల శాఖ మంత్రిత్వ శాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ చేసి తీరతామని మరోసారి కుండబద్దలుగొట్టింది. అయినా.. నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వం ప్లాంట్ మూసివేసేందుకు పూర్తిగా సహకారం అందిస్తోంది. ఇందులో భాగంగానే విశాఖ ఉక్కుకు కొద్ది దూరంలో అనకాపల్లి జిల్లాలో ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు సంపూర్ణ సహకారం అందిస్తోంది. ప్రజలు, ఉద్యోగుల ఆందోళనలు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల నిరసనలను ప్రభుత్వం ఏమాత్రం ఖాతరు చేయకుండా చంద్రబాబు, పవన్ కళ్యాణ్ అండ్ కో మిట్టల్‌కు మోకరిల్లుతున్నారు. స్టేజ్–1లో మిట్టల్ పరిశ్రమ ఏర్పాటుకు ఏకంగా రూ.28 వేల కోట్ల ప్రోత్సాహకాలు అందించిన చంద్రబాబు ప్రభుత్వం.. ఆ సంస్థకు కావల్సిన సమస్త సౌకర్యాలు కల్పించేందుకు సిద్ధమవడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మిట్టల్ బెదిరింపులు మామూలుగా ఉండవు

మిట్టల్ సంస్థ ప్లాంట్ ఏర్పాటు చేశాక ప్రభుత్వాన్నే బెదిరించే స్థాయికి చేరుకుంటుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే.. దక్షిణాఫ్రికాలో ఇదే మిట్టల్ సంస్థ అక్కడి ప్రభుత్వాన్ని బెదిరిస్తోంది. ఇప్పుడిస్తున్న రాయితీలు సరిపోవడం లేదనీ.. తాము కోరినంత రాయితీ, ప్రోత్సాహకాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తోంది. లేదంటే ప్లాంట్ మూసేస్తామంటూ హెచ్చరిస్తోంది. దీంతో భయాందోళనలకు గురైన దక్షిణాఫ్రికా ప్రభుత్వం తప్పని పరిస్థితుల్లో 92 మిలియన్ డాలర్ల భారీ రాయితీలు కల్పించేందుకు అంగీకారం తెలిపింది. మిట్టల్‌ని పెంచి పోషిస్తే భవిష్యత్తులో రాష్ట్ర ప్రభుత్వంపైనా ఇలాంటి బెదిరింపులు తప్పవని ప్రజాసంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కాగా.. కూటమి ఎంపీల తీరుపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడేందుకు ఒక్కసారి కూడా కూటమి ఎంపీలు కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ వద్దకు వెళ్లలేదు. కానీ.. మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు సకల సదుపాయాలు కల్పించాలని కోరేందుకు మాత్రం పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, విశాఖ ఎంపీ భరత్ నేతృత్వంలో కేంద్ర ఉక్కు శాఖ మంత్రి వద్ద సాగిలపడ్డారు. విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని ఏ ఒక్కరోజూ కోరని కూటమి ఎంపీలు మిట్టల్ ప్లాంట్‌కు మాత్రం సొంత ఐరన్ ఓర్ గనులు కేటాయించాలని మోకరిల్లుతున్నారు. విశాఖ ఉక్కుపై కూటమి ఎంపీలు, ప్రభుత్వ తీరుచూసి విశాఖ ఉక్కు పరిరక్షణ సంఘాలు ఆగ్రహంతో రగిలిపోతున్నాయి.

మిట్టల్‌పై ఎందుకంత మోజు?



మిట్టల్ స్టీల్‌ప్లాంట్ కోసం ఇప్పటికే వేల ఎకరాల భూముల్ని ధారాదత్తం చేసి.. ప్రజల జీవనోపాధి, జీవవైవిధ్యాన్ని ధ్వంసం చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. దశాబ్దాల చరిత్ర గల విశాఖ ఉక్కుని పరిరక్షించాలన్న ధ్యాస రాష్ట్ర ప్రభుత్వానికి లేదు. సొంత గనులు కేటాయించాలని పదేపదే కోరినా పట్టించుకోని ఎంపీలు.. ఇప్పుడు మిట్టల్‌కు సొంత గనులు కేటాయించాలని కోరడం దుర్మార్గం. ప్రభుత్వ తీరు చూస్తే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ని పూర్తిగా బలహీనపరచడమే ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. మిట్టల్ సంస్థపై చంద్రబాబు ప్రభుత్వం ఎందుకంత మోజు చూపిస్తోందో అర్థం కావడం లేదు. ఎంపీలు ప్రైవేటుకు ఊడిగం చేయడం హేయమైన చర్య. ఇప్పటికైనా కళ్లు తెరిచి స్టీల్‌ప్లాంట్‌కు రూ.30 వేల కోట్ల ఆర్థిక సాయం తీసుకొచ్చి ఆంధ్రుల హక్కుని బతికించాలి.

– ఈఏఎస్ శర్మ, కేంద్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి

పైడమ్మ చెరువును వదిలేయండి సారూ...!



పైడమ్మ చెరువు



డీజీఎన్‌పీ (ఏజీ)కి వినతి పత్రం అందజేస్తున్న వాడనర్సాపురం వాసులు

- వాడనర్సాపురం వాసుల వేడుకోలు
- చెరువు చుట్టూ ఫెన్సింగ్ పనులు నిలిపివేయాలని వినతి
- నేడు నేవల్ బేస్ అధికారులతో గ్రామస్తుల చర్చలు..?

రాంబిల్లి(అచ్యుతాపురం): తీర ప్రాంత గ్రామాలు ఒక్కొక్కటిగా తమ ఉనికి కోల్పోతూ స్థానిక మత్స్యకారుల జీవనోపాధిపై ప్రభావం చూపుతున్న వేళ రాంబిల్లి మండలంలోని వాడనర్సాపురం వాసులకు కొత్త కష్టాలు వచ్చిపడ్డాయి. గ్రామానికి ఆనుకొని ఉన్న 130 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పైడమ్మ చెరువును కాపాడుకొనేందుకు నానా అవస్థలు పడుతున్నారు. పరిశ్రమలు, జాతీయ స్థాయిలోని పరిశోధన కేంద్రాలకు భూములు తీసుకున్నప్పుడు ఒక విధంగా స్పందించిన అధికారులు కాగితాల్లో కనిపించే నిబంధనలను అమలు చేస్తూ ఏ మాత్రం అక్షర జ్ఞానం లేని గంగపుత్రుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తున్నారు. నావికా దళం కోసం చేపడుతున్న నిర్మాణాల్లో భాగంగా ఇప్పటికే సముద్రంపై పట్టు కోల్పోయి వేట కోసం తెలంగాణ పరిధిలోని నాగార్జున సాగర్ ఆయకట్టు కాల్వలకు వలస పోతుండగా, మిగిలిన వారికి కాస్తో కూస్తో ఆధారంగా ఉన్న చెరువు విషయంలోనూ ఇపుడు ఆందోళనకు గురవుతున్నారు.

ఊరు తరలించే వరకూ ఆంక్షలొద్దు...

ఉపాధి లేక వలస బాట పట్టిన వాడనర్సాపురం వాసులకు 130 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పైడమ్మ చెరువు కాస్తో కూస్తో ఊరటనిస్తుంది. దీనిలో 30 ఎకరాలు పోగా ఉన్న వంద ఎకరాల చెరువు వినియోగం విషయంలోనైనా గ్రామం తరలించే వరకూ ఆంక్షలు విధించొద్దని గ్రామస్తులు కోరుకుంటున్నారు. ఒక వైపు సముద్రంలో ఆంక్షలు, మరోవైపు పరిశ్రమల వల్ల తీరాల్లో తగ్గిన మత్స్య సంపద కారణంగా చెరువులే తమకు అండగా నిలుస్తున్నాయని చెబుతున్నారు.

ఫెన్సింగ్ పనుల అడ్డగింత

నేవల్ బేస్‌కి సంబంధించి డీజీఎన్‌పీ (ఏజీ) పాత్రుడు ఆధ్వర్యంలో సోమవారం పైడమ్మ చెరువు వద్ద ఫెన్సింగ్ పనులు ప్రారంభిస్తారని తెలుసుకున్న వాడనర్సాపురం వాసులు చర్చలు జరిపారు. ముందుగా అధికారులు ఇచ్చిన హామీ మేరకు గ్రామాన్ని తరలించిన తర్వాతే చెరువు ఫెన్సింగ్ పనులు చెపట్టాలని, పంచాయతీ ఆమోదం లేకుండా, ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా రెవెన్యూ యంత్రాంగం ఈ చెరువుని నేవల్ అధికారులకు ఎలా అప్పగిస్తుందని వారు ప్రశ్నించారు. చర్చల్లో రామారావు, చింతకాయల ఎర్రయ్య, కొవిరి సోమేశ్వరరావు, కారే రాముడు, సూరాడ అప్పలరాజు, వాసుపల్లి సూరిబాబు, మైలపల్లి లోవరాజులు డీజీఎన్‌పీ ప్రతినిధికి వినతి పత్రం అందజేశారు.

ఇదీ నేపథ్యం...

రాంబిల్లి మండలంలోని వాడనర్సాపురంలో 3700కు పైగా జనాభా ఉన్నారు. కూత వేటు దూరంలో సముద్రం ఉంది. మరో కిలోమీటర్ దూరంలో శారదా నది ఉంది. 2005లో నేవల్ బేస్ నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత 2008 నుంచి పరిహారం ఇవ్వడం ప్రారంభించారు. అప్పట్లో భూమికి రూ.3లక్షలు చొప్పున పరిహారం, వృత్తి కోల్పోయిన వారికి ప్యాకేజీ కింద లక్ష రూపాయలు చొప్పున ఇచ్చారు. ఒకవైపు సముద్రం, మరోవైపు శారదా నది, దీనికి తోడు పైడమ్మ చెరువుపై ఆధారపడి చేపల వేట చేసే ఇక్కడి మత్స్యకారులకు నేవల్‌బేస్ వచ్చిన తర్వాత పరిస్థితి క్లిష్టంగా మారింది. ఇప్పటికే 100 కుటుంబాలకు చెందిన వారు శ్రీశైలం, నాగార్జునసాగర్ తదితర ప్రాంతాలకు వలస వెళ్లిపోయారు. తాజాగా పైడమ్మ చెరువుకు ఫెన్సింగ్ వేయాలన్న ప్రతిపాదన మత్స్యకారులకు సమస్యగా మారింది. ఫెన్సింగ్‌కు తాము ఒప్పుకునేది లేదని ఇక్కడ వారు చెప్పున్నారు.

క్లుప్తంగా

ఎస్పీ కార్యాలయానికి 35 అర్జీలు



అర్జీదారుల సమస్యను వింటున్న ఎస్పీ

అనకాపల్లి: ఎస్పీ కార్యాలయానికి పీజీఆర్ఎస్‌కు సోమవారం 35 అర్జీలు వచ్చాయి. ఎస్పీ తుహిన్ సిన్హా అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూతగాదాలు–25, కుటుంబ కలహాలు–4, మోసాలకు సంబంధించినవి–2, వివిధ విభాగాలకు చెందినవి–4 అర్జీలు అందాయి. చట్ట పరిధిలో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహన్‌రావు, ఎస్ఐ వెంకన్న, అర్జీదారులు పాల్గొన్నారు.

జిల్లా సమాచార శాఖ వాహనానికి బహిరంగ వేలం

తుమ్మపాల: జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ వీడియో కవరేజ్ వాహనానికి ఈ నెల 21వ ఉదయం 11 గంటలకు కార్యాలయ ప్రాంగణంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎస్.వి. రమణ తెలిపారు. కాలపరిమితి ముగిసి, నిరుపయోగంగా ఉన్న మహీంద్రా నిస్సాన్ (ఏపి31 టి5083, 1993 మోడల్) వాహనాన్ని బహిరంగ వేలం వేసేందుకు నిర్ణయించామని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు రూ.1,000 ధరావతు సొమ్ము చెల్లించవలసి ఉంటుందని, వేలం దక్కించుకున్న వారు జీఎస్టీతో సహా మొత్తం నగదు వెంటనే చెల్లించాలని తెలిపారు. వాహనాన్ని కార్యాలయ పని వేళల్లో పరిశీలించవచ్చని, వేలం వేయడం, రద్దు చేసే అధికారం కార్యాలయ అధికారికి ఉందని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెం.9100442488కు సంప్రదించాలని కోరారు.

విస్తృతంగా

'జీవీఎంసీ ఆపరేషన్ లంగ్స్'

దాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలోని ప్రభుత్వ భూములు, ఖాళీ స్థలాలు, పార్కులు, రిజర్వ్ ప్రదేశాలు, ఇతర ప్రజా ఆస్తులను పరిరక్షించడం చాలా ముఖ్యమని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. ఈ ఆస్తులపై హక్కులు పూర్తిగా ప్రభుత్వం, జీవీఎంసీకే ఉంటాయని స్పష్టం చేశారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించినా, ఆక్రమణకు ప్రయత్నించినా కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ మేరకు నగరంలో ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కోసం జీవీఎంసీ 'ఆపరేషన్ లంగ్స్' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని విస్తృతం చేసిందని కమిషనర్ తెలిపారు.

ధర్నాలతో దద్దరిల్లిన కలెక్టరేట్

- జిల్లాలో బలవంతపు భూసేకరణ ఆపాలని రైతుల ఆందోళన
- ఫ్రీ బస్సు పథకంపై ఆటో డ్రైవర్ల నిరసన
- పీజీఆర్ఎస్‌లో 291 అర్జీల నమోదు



పీజీఆర్ఎస్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, జేసీ జాహ్నవి

తుమ్మపాల: కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం పలు ప్రజా సంఘాలు, రైతుల నిరసనలతో హోరెత్తింది. జిల్లాలో పలు ప్రాంతాల్లో చేపడుతున్న భూసేకరణలకు వ్యతిరేకంగా రైతులు తమ ఆవేదనను నిరసనల రూపంలో తెలియజేశారు. మహిళలకు ఉచిత బస్సు పథకంతో తమ ఉపాధికి గండి పడుతుందని ఆటో డ్రైవర్లు ఆందోళన చేశారు. ఇలా నిరసనలు, విన్నపాలతో కలెక్టరేట్ దద్దరిల్లింది. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో పీజీఆర్ఎస్ నమోదు శిబిరం వద్ద కంప్యూటర్లు పనిచేయలేదు.దీంతో ఫిర్యాదుదారులు అర్జీలు పట్టుకుని క్యూలోనే నిరీక్షించారు. అర్జీదారుల నుంచి కలెక్టర్ విజయ కృష్ణన్, జేసీ జాహ్నవి, డీఆర్వో సత్యనారాయణరావు అర్జీలు స్వీకరించారు. మొత్తం 291 అర్జీలు నమోదయ్యాయి.

బల్క్ డ్రగ్ పార్కుకు భూమిలిచ్చేది లేదు..

బల్క్ డ్రగ్ పార్క్ కోసం భూసేకరణ నోటీస్6(ఎ)ను ఉపసంహరించుకోవాలని కోరుతూ నక్కపల్లి మండలం సీహెచ్ఎల్ పురం పరిధిలో జానకియ్యపేట గ్రామస్తులు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. గ్రామంలో 192 ఎకరాల పచ్చని భూమిని సేకరించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలు, పర్యావరణ, మత్స్యకారుల ఉపాధికి నష్టం కలిగించే ప్రమాదకరమైన పరిశ్రమకు భూములిచ్చేది లేదంటూ తేల్చిచెప్పారు. గత నెల 25న నక్కపల్లి తహసీల్దార్‌కు అభ్యంతర లేఖలు అందజేశామని, ఈ నెల 6న చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణలో కూడా తీవ్రంగా వ్యతిరేకించామని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వ్యవసాయం తప్ప వేరే జీవనాధారం లేని తమకు తాతముత్తాల నుంచి సంక్రమించిన భూములు ఇచ్చేదిలేదని, తక్షణమే భూసేకరణ నోటీసులు రద్దు చేయాలని కోరారు.

వీహెచ్‌పీ సభ్యుల నిరసన

గోశాలపై ఫిర్యాదు చేసినందుకు నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సభ్యుడు సోమిరెడ్డి రాజుపై హత్యాయత్నం చేసిన దుండగులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ విశ్వ హిందూ పరిషత్ సభ్యులు కలెక్టరేట్ వద్ద నిరసన చేశారు. ఎస్.రాయవరం మండలం పెనుగొల్లుకు చెందిన కొంతమంది రక్షణ చారిటబుల్ ట్రస్ట్ పేరుతో ముఠాగా ఏర్పడి గోవుల అక్రమ రవాణా చేస్తున్న వ్యవహారంపై సోమిరెడ్డి రాజు ఫిర్యాదు చేశారన్న కక్షతో ముఠా ముఖ్య సభ్యులు, రౌడీ షీటర్ గొర్ల దేవుళ్ళు, గోకులపాడుకు చెందిన సమ్మంగి నానాజీ, నానేపల్లి లక్ష్మణ్ తండ్రి రాజబాబు ఇంటిలోకి చొరబడి చంపేందుకు ప్రయత్నించారని, తక్షణమే చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు.

ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలి



రాజకీయ ప్రయోజనాల కోసం మహిళలను ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో తమకు జీవనోపాధి లేకుండా చేస్తున్నారని, ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ ఏపీ ఆటో, ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ఆటో కార్మికులు ధర్నా చేశారు. ఈ నెల 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణంతో తమకు బేరాలు తగ్గిపోతాయని, ఆటోల కొనుగోలు కోసం చేసిన అప్పులకు నెలనెలా ఈఎంఐలు చెల్లింపులు ఇక కష్టమంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో డ్రైవర్లకు ప్రతి ఏటా రూ.25 వేలు వాహనమిత్ర పథకం కింద అందజేసి, ఆదుకోవాలన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలపై వ్యాట్ తగ్గించాలని, వడ్డీ లేని రుణాలతో రూ.4 లక్షల సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఎంసెట్‌లో లోకల్‌గా పరిగణించాలి



ఇంటర్ రెండేళ్ల పాటు తెలంగాణలో చదవడం వల్ల తనను ఆంధ్రాలో రాసిన ఎంసెట్‌లో నాన్ లోకల్‌గా పరిగణిస్తున్నారని నర్సీపట్టణానికి చెందిన పి.తులసి కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. పదో తరగతి వరకు ఆంధ్రాలో చదువుకుని, ఇంటర్ మాత్రమే తెలంగాణాలో చేశానని ఆమె పేర్కొన్నారు. ఎంసెట్ కౌన్సిలింగ్‌లో తనను నాన్ లోకల్‌గా పరిగణించడం వల్ల ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు ఉద్యోగ అవకాశాల్లో కూడా నాన్ లోకల్‌గా పరిగణించే అవకాశం ఉందని, తనను లోకల్‌గా పరిగణించాలని ఆమె కోరారు.

వితంతు పింఛన్ నిలిపివేశారు..



అంగన్‌వాడీ హెల్పర్‌గా పనిచేస్తూ నెలకు రూ.7 వేలు వేతనం తీసుకుంటున్న తనను ప్రభుత్వ ఉద్యోగిగా పరిగణిస్తూ వితంతు పింఛన్ మంజూరు చేయడం లేదని మాకవరపాలెం మండలం రాచపల్లి గ్రామానికి చెందిన రావాడ రమణమ్మ పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. వికలాంగుడైన భర్త మాణిక్యం గతేడాది నవంబర్‌లో మరణించారని, అతని పింఛన్ తనకు భర్తీ చేసి వితంతు పింఛన్ మంజూరు చేయాలని కోరుతున్నా అధికారులు పొంతన లేని సమాధానాలు ఇస్తున్నారని వాపోయింది. చాలా మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లకు సామాజిక పింఛన్ అందిస్తున్నా తనకు మాత్రం అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేసింది.

తక్షణం భూసేకరణ విరమించుకోవాలి



భూసేకరణ ప్రతిపాదన విరమించుకోవాలంటూ నిరసన తెలుపుతున్న బుచ్చెయ్యపేట రైతులు

బుచ్చెయ్యపేట మండలం ఆర్.శివరాంపురం, భీమవరం, మల్లాం గ్రామాల్లో చేపట్టనున్న భూసేకరణ ప్రతిపాదనను తక్షణమే విరమించుకోవాలని రైతులు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. వ్యవసాయమే జీవనాధారంగా జీవించే రైతుల భూములను పరిశ్రమల ఏర్పాటు పేరుతో తీసుకుని అన్యాయం చేయొద్దని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

మండల కేంద్రాల్లో వాలీబాల్ కోర్టుల ఏర్పాటుకు చర్యలు

జిల్లా క్రీడా అభివృద్ధి కమిటీ సమావేశంలో కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశం



జిల్లా స్థాయి జిల్లా క్రీడా అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: మండల ప్రధాన కేంద్రాల్లో వాలీబాల్ కోర్ట్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ సంబంధిత అధికారులు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా స్థాయి జిల్లా క్రీడా అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించి, మంచి క్రీడాకారులను తయారు చేయాలన్నారు. ప్రతిభ ఉన్న క్రీడాకారులకు సరైన ప్రోత్సాహం లభిస్తే అద్భుతంగా రాణిస్తారన్నారు. క్రీడల ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, సమయపాలన, క్రీడాస్ఫూర్తి అలవడుతుందన్నారు. నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలో 2 అవుట్ డోర్ బ్యాడ్మింటన్ కోర్ట్, వాలీబాల్ కోర్ట్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు ఆమోదం చేశారు. నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలో 50 సెంట్లలో భూమిని సేకరించి ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యం మోడల్‌లో స్విమ్మింగ్ పూల్‌కు సంబంధించిన ప్రతిపాదనలు పంపించాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. మండల కేంద్రాల్లో 20 సెంట్లలో భూమిని సేకరించి వాలీబాల్ కోర్ట్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి మాట్లాడుతూ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో పికెల్ బాల్ కోర్టు ఏర్పాటు చేయాలని, దానికి సంబంధించి కొలతలు, నిధుల వివరాలు సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎల్.వెంకటరమణ, జిల్లా పరిషత్ ఉప ముఖ్య కార్యనిర్వహణ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి సందీప్, జిల్లా గ్రామ వార్డు సచివాలయాల అధికారి మంజులవాణి, డ్వామా పీడీ పూర్ణిమాదేవి, యలమంచిలి, అనకాపల్లి మునిసిపల్ కమిషనర్లు, ఏపీఐఐసీ డిప్యూటీ మేనేజర్ రాజశేఖర్, సమగ్ర శిక్ష కార్యనిర్వాహక ఇంజినీర్ నరసింహమూర్తి పాల్గొన్నారు.

తిరంగా...ఘనంగా

- 75 మీటర్ల పొడవైన జాతీయ జెండాతో ర్యాలీ



హర్ ఘర్ తిరంగా ర్యాలీని ప్రారంభిస్తున్న సర్పంచ్ అక్కునాయుడు, హెచ్ఎం శేఖర్

కె.కోటపాడు : ఎ.కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు హర్ ఘర్ తిరంగా ర్యాలీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు 75 మీటర్ల పొడవు గల జాతీయ జెండాతో గ్రామంలో ర్యాలీ జరిపారు. ర్యాలీని పాఠశాల నుంచి స్థానిక సర్పంచ్ బొడ్డు అక్కునాయుడు, పీఎంసీ కమిటీ చైర్మన్ కిల్లి సింహాచలంనాయుడు, హెచ్ఎం శేఖర్, పీఈటీ కె.చిట్టిప్రసాద్ ప్రారంభించారు. ప్రతి విద్యార్థి దేశభక్తిని పెంచుకోవాలని హెచ్ఎం శేఖర్ ఆకాంక్షించారు.

కూటమి నాయకుల విధ్వంసంపై ఫిర్యాదు



సామాజిక భవనం మెట్లను ధ్వంసం చేస్తున్న కూటమి నాయకులు

తుమ్మపాల : మండలంలో బట్లపూడి పంచాయతీ రాయుడుపేటలో సామాజిక భవనం మెట్లను ఆదివారం మధ్యాహ్నం కూటమి నాయకులు యంత్రాలతో ధ్వంసం చేసినట్టు గ్రామస్తులు సోమవారం కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్, ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో సామాజిక అవసరాల కోసం 2003లో మండల పరిషత్ నిధులతో చేపట్టిన సామాజిక భవనాన్ని కూటమి నాయకులు నిబంధనలు పాటించకుండా ధ్వంసం చేయడం దారుణమన్నారు. ప్రభుత్వ సెలవు దినం నాడు మెట్లను ధ్వంసం చేసి సామాజిక భవనం కూల్చేందుకు ప్రయత్నించడంపై అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

నర్సీపట్నంలో ఈదురుగాలుల బీభత్సం



గచ్చపు వీధిలో విరిగిన విద్యుత్ స్తంభం



చెట్లను తొలగిస్తున్న ఫైర్ సిబ్బంది



నలంద స్కూల్ వీధిలో నిలిచిన వర్షపు నీరు

- విరిగిన స్తంభాలు, నేలకూలిన చెట్లు

నర్సీపట్నం : పట్టణంలో సోమవారం మధ్యాహ్నం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని మెయిన్‌రోడ్‌తో పాటు వీధులన్నీ జలమయమయ్యాయి. జనజీవనం స్తంభించింది. గచ్చపు వీధి, తదితర ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. ఆర్డీవో కార్యాలయం, పాత మున్సిపల్ కార్యాలయ ప్రాంతాల్లో చెట్లు నేలకూలాయి. దీంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. రాకపోకలకు అంతరాయం లేకుండా నేలకూలిన చెట్లను ఫైర్ సిబ్బంది తొలగించారు. అయినప్పటికీ రాత్రి 8 గంటల వరకు విద్యుత్ లేక చీకట్లు అలముకోవడంతో పట్టణ ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

జిల్లా వాలీబాల్ బాలికల జట్టు ఎంపిక



జిల్లా వాలీబాల్ బాలికల జట్టు

అనకాపల్లి : ఈనెల 29న జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో స్థానిక గవరపాలెం జీవీఎంసీ చిన్న హైస్కూల్లో శాప్ వాలీబాల్ బాలికల జట్టు ఎంపిక కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా క్రీడా ప్రాధికారిక సంస్థ అధికారి ఎల్.వి.రమణ మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుండి 14 మంది బాలికలు హాజరయ్యారని, జిల్లా జట్టుగా 12 మంది క్రీడాకారులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. విశాఖలో ఈనెల 16 నుంచి 20 వరకు జరుగు జోనల్ పోటీల్లో క్రీడాకారులు పాల్గొంటారని, అక్కడ గెలుపొందిన జట్టు ఈనెల 21 నుంచి 25 వరకు విజయవాడలో జరుగు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ జట్టుకు కోచ్ కం మేనేజర్లుగా జాతీయ వాలీబాల్ రిఫరి భీశెట్టి శ్రీనివాసరావు, విల్లూరి ప్రసాద్ వ్యవహరిస్తారు. కార్యక్రమంలో సీనియర్ వాలీబాల్ క్రీడాకారులు ఎల్లపు గోవింద, రాపేటి సీతారాం, దాడి ఓం శివ, పీలా రమణారావు, బుద్ధ శివ, కె.ఆర్.కె సత్యనారాయణ పాల్గొన్నారు.

నక్కపల్లిలో హాకీ ఎంపికలు



నక్కపల్లి క్రీడా మైదానంలో తలపడుతున్న క్రీడాకారులు



జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైన నక్కపల్లి హాకీ క్రీడాకారులు

నక్కపల్లి: ఈ నెల 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని జోనల్ స్థాయి హాకీ పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల ఎంపికలు సోమవారం జరిగాయి. నక్కపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న హాకీ కోర్టులో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన హాకీ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ నెల 29న విశాఖలో జరిగే జోనల్ స్థాయి పోటీలకు నక్కపల్లి బీఎస్ హాకీ క్లబ్ నుంచి 8 మంది, యలమంచిలి నుంచి 8 మంది క్రీడాకారులు ఎంపికైనట్టు జిల్లా స్పోర్ట్స్ అధికారి ఎల్.వి.రమణ తెలిపారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు జరిగిన ఈ పోటీల్లో ఎంపికైన విజేతలు జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు.

ముగిసిన ఖోఖో పోటీలు



అండర్-14 విభాగంలో గెలుపొందిన బాలుర జట్టు

పాయకరావుపేట: మూడు రోజులుగా శ్రీప్రకాష్ విద్యా సంస్థలో జరుగుతున్న సీబీఎస్ఈ క్లస్టర్–7 తెలుగు రాష్ట్రాల బాల బాలికల ఖోఖో పోటీలు సోమవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు సభలో విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ అంతర్రాష్ట్ర ఖోఖో చాంపియన్ షిప్ పోటీలలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 180కి పైగా జట్లు, 2000 మంది క్రీడాకారులు పాల్గొని తమ క్రీడా స్ఫూర్తిని చాటుకున్నారన్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. విజేతలకు మెడల్స్, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పోటీల పరిశీలకుడు సిహెచ్.ఎల్.ఎం.శ్రీనివాస్, సీనియర్ ప్రిన్సిపాల్ ఎం.అపర్ణ, వివిధ ప్రాంతాల విద్యార్థులు, కోచ్‌లు, మేనేజర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజేతల వివరాలు

అండర్–19 బాలికల విభాగంలో సిస్టర్ నివేదిత స్కూల్, హైదరాబాద్ జట్టు ప్రథమ స్థానంలో, వెరిటాస్ సైనిక్ స్కూల్ తిరుపతి జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. అండర్ –19 బాలుర విభాగంలో వెరిటాస్ సైనిక్ స్కూల్, తిరుపతి జట్టు ప్రథమ, ఫార్చ్యూన్ బటర్ఫ్లై స్కూల్, మహబూబ్‌నగర్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. అండర్–17 బాలికల విభాగంలో శ్రీప్రకాష్ విద్యానికేతన్, పాయకరావుపేట ప్రథమ, మాంటిస్సోరి ఎలైట్ ఇంగ్లిషు మీడియం స్కూల్, అనంత్‌పూర్ ద్వితీయ స్థానం దక్కించుకున్నాయి. అండర్–17 బాలుర విభాగంలో శ్రీప్రకాష్ విద్యానికేతన్, పాయకరావుపేట ప్రథమ, ఎకార్డ్ స్కూల్, తిరుపతి జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. అండర్–14 బాలికల విభాగంలో హీల్ స్కూల్, నరసింగపాలెం ప్రథమ, సూర్యా అకాడమీ స్కూల్, హైదరాబాద్ జట్టు ద్వితీయ స్థానంలో మెరిశాయి. అండర్ –14 బాలుర విభాగంలో శ్రీ ప్రకాష్ విద్యానికేతన్, పాయకరావుపేట ప్రథమ, ఏకశిల ఇంటర్‌నేషనల్ స్కూల్, మహబూబ్ నగర్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచినట్లు సిహెచ్ విజయ్ ప్రకాష్ తెలిపారు.

దూసుకొచ్చిన మృత్యువు

- విశాఖ ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సు ఢీకొని మహిళ మృతి
- మరొకరికి గాయాలు



మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువు (ఇన్‌సెట్) ముత్యాలమ్మ(ఫైల్)

దాబాగార్డెన్స్(విశాఖ):

ఆ కుటుంబం ఆదివారం ఎంతో సంతోషంగా గడిపింది. మనుమడి అన్నప్రాసన వేడుకతో ఇల్లంతా కోలాహలంగా ఉంది. ఆ వేడుకను విజయవంతంగా ముగియగా.. సంతోషంగా తిరిగి ప్రయాణమవుతున్న ఆ ముత్యాలమ్మకు తెలియదు, అది తన జీవితానికి చివరి ప్రయాణమని. ఆర్టీసీ బస్సు రూపంలో మృత్యువు వెంటాడి, కబళిస్తుందని... ఈ విషాద ఘటన సోమవారం సాయంత్రం ద్వారకా బస్టాండ్‌లో చోటుచేసుకుంది. విజయనగరం జిల్లా శృంగవరపుకోట, పోతనాపల్లి గ్రామానికి చెందిన గేదెల ముత్యాలమ్మ (47), తన పెద్ద కుమార్తె కుమారుడి అన్నప్రాసన కోసం గాజువాకలో ఉన్న ఇంటికి వచ్చారు. ఆదివారం కుటుంబ సభ్యులందరూ కలిసి వేడుకను ఆనందంగా జరుపుకున్నారు. సోమవారం తిరుగు ప్రయాణమై, ద్వారకా బస్టాండ్‌కు చేరుకున్నారు. బొబ్బిలికి వెళ్లే తన చిన్న కుమార్తెను బస్సు ఎక్కించి, తాను ఎస్.కోట వెళ్లే బస్సు కోసం ప్లాట్‌ఫాం నంబర్ 25 వద్ద వేచి ఉన్నారు. సరిగ్గా అదే సమయంలో విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వెళ్లే పల్లెవెలుగు బస్సు అతివేగంగా ప్లాట్‌ఫాంపైకి దూసుకువచ్చింది. ఆ బస్సు ఢీకొనడంతో ముత్యాలమ్మ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో వ్యక్తి స్వల్పంగా గాయపడ్డారు. నిండు నూరేళ్లు జీవించాల్సిన ఆ తల్లి, మనుమడిని చూసుకున్న సంతోషం మనసులో మెదులుతుం డగానే, విధి ఆడిన వింత నాటకానికి బలైపోయింది. సంతోషంగా ముగిసిన అన్నప్రాసన వేడుక, మరుసటి రోజే విషాదాన్ని మిగిల్చింది. ముత్యాలమ్మ మృతితో ఆమె కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.

విజయనగరం జిల్లా శృంగవరపుకోట (ఎస్.కోట)కు చెందిన గేదెల ముత్యాలమ్మ (47) తన గ్రామానికి వెళ్లేందుకు సోమవారం సాయంత్రం 4.30 గంటలకు ద్వారకా బస్టాండ్‌కు చేరుకున్నారు. ఎస్.కోటకు వెళ్లే ప్లాట్‌ఫాం వద్ద ఆమె బస్సు కోసం వేచి ఉన్నారు. సుమారు 4.50 గంటల ప్రాంతంలో విశాఖ నుంచి శ్రీకాకుళం వెళ్లే పల్లెవెలుగు బస్సు (హైర్ బస్సు) డ్రైవర్ చంద్రరావు బస్సును అతివేగంగా ప్లాట్‌ఫాంపైకి పోనిచ్చాడు. ఈ క్రమంలో బస్సు కోసం వేచి ఉన్న ముత్యాలమ్మను తీవ్రంగా ఢీకొనడంతో ఆమె బస్సు, ప్లాట్‌ఫాం వద్ద ఉన్న స్తంభం మధ్య నలిగిపోయి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంలో మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ముత్యాలమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

డ్రైవర్ నిర్లక్ష్యమే కారణం

బస్టాండ్‌లోని ప్లాట్‌ఫాంపైకి బస్సు తీసుకొచ్చేటప్పుడు గంటకు 5 కిలోమీటర్ల వేగం మించకూడదని నిబంధనలు చెబుతున్నాయి. అయితే, వేగంగా వచ్చిన బస్సు ప్రమాదానికి కారణమైందని జిల్లా ప్రజా రవాణా అధికారి బి. అప్పలనాయుడు 'సాక్షి'కి తెలిపారు. వెహికల్ ఇన్‌స్పెక్టర్ తనిఖీ తర్వాత ఈ విషయం స్పష్టమైంది. దీనిపై డ్రైవర్ చంద్రరావును ప్రశ్నించగా, బ్రేకులు ఫెయిల్ అయ్యాయని చెప్పినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనతో బస్టాండ్‌లో భద్రతా ప్రమాణాలపై మరోసారి చర్చ మొదలైంది.

క్లుప్తంగా

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ నేడు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి గ్రామాల్లో కళాశాలలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు వైద్యాధికారి ఎ. మనిషా తెలిపారు. జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా ఏడాది నుంచి 19 ఏళ్లలోపు బాల బాలికలందరికీ మధ్యాహ్న భోజనం అనంతరం మాత్రలు మింగించనున్నట్లు తెలిపారు. స్కూలుకు వెళ్లని పిల్లలకు వీటిని అందజేస్తామన్నారు. నులి పురుగుల వల్ల పిల్లలకు రక్తహీనత, పోషకాహార లోపం, శారీరక, మానసిక ఎదుగుదల లోపాలు ఏర్పడతాయన్నారు. అందువల్ల నిర్దేశిత వయస్సు కలిగిన పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా మింగించాలన్నారు. తమ కేంద్రం పరిధిలో 7,328 మందికి మాత్రలు సరఫరా చేయనున్నట్లు తెలిపారు.

ఆలయ భూముల కౌలు వేలం రేపు

కశింకోట: దేవదాయ శాఖకు చెందిన స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ భూములకు సంబంధించి మూడేళ్ల కాల పరిమితితో కౌలుకు ఇవ్వడానికి ఈ నెల 13న ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహించనున్నట్లు ఈవో సత్యనారాయణమూర్తి తెలిపారు. పలు గ్రామాల్లో 40.68 ఎకరాల పంట భూములకు సంబంధించి ప్రథమ ధరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొవాలన్నారు. ఎక్కువ మొత్తానికి పాట పాడుకున్న వారు ఏడాదికి కౌలు సొమ్ము డిపాజిట్‌గా సత్వరమే చెల్లించాల్సి ఉంటుందన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

కశింకోట: స్థానిక సర్వ మంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి ఆలయం (శివాలయం)లో సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు ఎక్కువగా హాజరయ్యారు. మధ్యాహ్నం పేదలకు దాతల సహకారంతో అన్నదానం చేశారు. అర్చకులు వి. చిదంబరం, వి. కృష్ణల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ



కన్నూరుపాలెం చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ స్వామినాయుడు

కశింకోట: అధిక బరువును తరలించే వాహనాలకు భారీ చలానాలు విధిస్తున్నామని సీఐ అల్లు స్వామినాయుడు హెచ్చరించారు. మండలంలోని కన్నూరుపాలెం చెక్‌పోస్టు వద్ద సోమవారం రాత్రి వాహనాల తనిఖీలు నిర్వహించారు. 45 వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహన నిర్వాహకులు పరిమితికి మించి బరువు తరలించరాదన్నారు. రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం.వి.ఎం. కాశీవిశ్వనాథ, సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 127 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,400	4,750
రెండో రకం	3,470	4,110
మూడో రకం	3,090	3,440

అనకాపల్లి సినిమాలు

రాజా	: సార్ మేడమ్ (మ్యాట్నీ, సెకండ్‌షో)
రాజా	: అతడు (ఫస్ట్ షో, మార్నింగ్ షో)
సత్యనారాయణ స్క్రీన్-1	: కింగ్‌డమ్
సత్యనారాయణ స్క్రీన్-2	: సోమేశ్వర సులోచన
పర్తిసాయి	: మహావతార్ నరసింహం
షిర్డీసాయి	: బకాసుర రెస్టారెంట్
వెంకటేశ్వర	: మాత్ర
శ్రీ సత్య	: జూనియర్
రామచంద్ర	: హరిహర వీరమల్లు

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 401 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 364 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

రక్త నిల్వలు


అనకాపల్లి:ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 45 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-6, బీ పాజిటివ్-11, ఓ పాజిటివ్-23, ఏబీ పాజిటివ్-5 యూనిట్లు శుద్ధి చేసిన రక్త నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ యూ లోకేష(9703613706)ను సంప్రదించవచ్చు.

అంధకారంలో శాంతి పార్కు

- 10 రోజుల నుంచి చీకట్లో ఇబ్బందులు
- ఏడాదికే మరమ్మతులకు గురైన విద్యుత్ దీపాలు
- సెల్‌ఫోన్ వెలుతురులో చిన్నారుల ఆటలు
- నిర్వహణను పట్టించుకోని కూటమి పాలకులు



పార్కులో ఫౌంటెన్ దుస్థితి



తిరుగుడు రాట్నంలో విరిగిన కుర్చీలు



శారదానది ఒడ్డున శాంతి పార్కు ముఖ ద్వారం

అనకాపల్లి టౌన్: పట్టణ వాసులకు ఆహ్లాదకర వాతావరణం కొరవడింది. నిత్యం బిజీబిజీ జీవితం గడుపుతూ సాయంత్రం వేళ కాసేపు ప్రశాంతంగా సేద తీరుదామని వచ్చిన వారికి అంధకారమే ఆహ్వానిస్తోంది. పట్టణంలోని శాంతి పార్కులో పది రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. ఇక్కడ విద్యుత్ లైట్లు పని చేయకపోవడంతో చీకట్లో ఉండలేక వెళ్లిపోతున్నారు.

శారదానది ఒడ్డున్న ఉన్న ఈ పార్కు చరిత్ర వర్ణించలేనిది. పట్టణానికి ఏకైక పార్కుగా నిత్యం కళకళలాడుతూ విరాజిల్లేది. ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్న ఈ పార్కును ఎన్నోయేళ్లు పాలకులు గాలికి వదిలేశారు. గత ప్రభుత్వ హయాంలో 2024లో లక్షలాది రూపాయిల నిధులతో అభివృద్ధి చేశారు. ప్రభుత్వం మారడంతో పార్కు నిర్వహణను గాలికొదిలేశారు. ఈ పార్కుకు ఉదయం మొదలు కొని రాత్రి వరకు చిన్నారులు, మహిళలు, వృద్ధులు వస్తుంటారు. ఈ పార్కు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మించడంతో వాకర్స్ నిత్యం వస్తుంటారు. మధ్యాహ్న సమయంలో పార్కులో సేద తీరేందుకు సుదూర ప్రాంతాల నుంచి వివిధ పనుల మీద వచ్చే ప్రజలు, దినసరి కూలీలు వస్తుంటారు. నదీ ఒడ్డున కావడంతో చల్లని గాలులు వీస్తుండంతో ప్రశాంత వాతావరణంలో చదువుకోవడానికి విద్యార్థులు వస్తుంటారు. ఈ పార్కుకు ఒకవైపు పట్టణం ఉండగా, మరొక వైపు మండలం ఉంది. మధ్యలో శారదానది ఉంది. దీంతో పట్టణ ప్రజలే కాకుండా మండలంలోని శారదానగర్, రామాపురం, బీఆర్టీ కాలనీ, కుంచంగి, వేటజంగాలపాలెం, సుందరయ్యపేట, పిసినికాడ, కశింకోట ప్రాంతాల ప్రజలు సేద తీరేందుకు ఈ పార్కుకే వస్తుంటారు.

విరిగిపోయిన ఆటల సామగ్రి..

అంతటి ప్రాముఖ్యత ఉన్న పార్కును ప్రారంభించిన ఏడాదిలోనే విద్యుత్ దీపాలు పాడైపోయాయి. దీన్ని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. పార్కులో ఒక్కటంటే ఒక్క లైట్ వెలగడం లేదు. సమీపంలో రోడ్డుపై ఏర్పాటు చేసిన వీధి దీపాల వెలుతురు ఒక పక్కగా ఇక్కడ ఒక పార్కు ఉందనే విధంగా మసకగా కనిపిస్తుంది. ఆటలాడేందుకు చిన్నారులు మారాం చేస్తుండటంతో చీకటైనా తల్లిదండ్రులు ధైర్యం చేసి పార్కుకు తీసుకువస్తున్నారు. తల్లిదండ్రుల సెల్‌ఫోన్స్ లైట్లు వేసి పిల్లలను ఆడిస్తున్నారు. పార్కులో కొన్ని ఆటవస్తువులు పాడైపోయాయి. రౌండ్ ఊయలలో చిన్న పిల్లలు ఆడుకొనే బెంచీలు విరిగిపోయాయి. ఈ పార్కుకు ఆనుకొనే శారదానది ఉండడం, సమీప ప్రాంతాలన్నీ తుప్పలతో నిండి ఉన్నాయి. దీనివల్ల ఎక్కువగా పురుగు, విషసర్పాలు సంచరించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. జరగరానిదేదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని పలువురు వాపోతున్నారు.

మందుబాబులకు అడ్డాగా...

ఈ పార్కు మధ్యలో వాటర్ ఫౌంటెన్ ఏర్పాటు చేశారు. దాని నుంచి నీరు రాకపోగా చెత్తా చెదారాలతో నిండిపోయింది. వెయ్యి లీటర్ల సామర్థ్యంతో వాటర్ ట్యాంక్‌ను నిర్మించారు. ఆ ట్యాంక్ అలంకార ప్రాయంగానే ఉంది. వాటర్ లైన్స్ ఏర్పాటు చేసినా అందులోంచి వాటర్ రావడంలేదు. ఇక్కడికి వచ్చే వారికి ఎటాంటి ఇబ్బందులు కలగకుండా, పార్కు బాగోగులు చూసుకోవడానికి కొన్ని నెలల వరకు ఒక వాచ్‌మన్ ఉండేవాడు. ప్రస్తుతం అతడు లేకపోవడంతో చీకటి పడితే మందుబాబులు అడ్డాగా చేసుకుంటున్నారని సందర్శకులు వాపోతున్నారు.



సెల్‌ఫోన్ వెలుగులో ఆడుకుంటున్న చిన్నారులు

ఒక్క లైటూ వెలగడం లేదు.



పట్టణంలో ఏకైక పార్కును పట్టించుకోవడం దారుణం. గత్యతరం లేని పరిస్థితుల్లో చీకటి అయినా పిల్లలు చేసే మారాము చేస్తుంటే, తట్టుకోలేక పార్కుకు తీసుకువస్తున్నాం. పార్కులో కనీసం ఒక్క లైటూ వెలగడం లేదు.

– జి రాజేష్, అనకాపల్లి

గేటుకు తాళం వేయాలి



పన్నులు చెల్లిస్తున్నా పార్కు అభివృద్ధిపై అధికారులు, పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. చీకటిలోనే పిల్లలను భయపడుతూ ఆడిస్తున్నాం. ఏదైనా జరిగితే ఎవ్వరూ బాధ్యులు? నిర్వహణ చేయలేకపోతే గేటుకు తాళం వేయాలి.

–ముఖేష్, అనకాపల్లి

16న శ్రీకృష్ణాష్టమి వేడుక



గణపతి లక్ష్మీసమేత శ్రీకృష్ణ మందిరం

అనకాపల్లి: మండలంలోని మారేడుపూడి గ్రామంలో బీసీ కాలనీలో గణపతి లక్ష్మీసమేత శ్రీకృష్ణ స్వామి ఆలయంలో ఈ నెల 16న శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు ఈగల కృష్ణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదేరోజు మధ్యాహ్నం భారీ అన్నసమారాధన, సాయంత్రం 4 గంటలకు ఉట్టి కొట్టుట, రాత్రి 7 గంటలకు క్లాసికల్ కూచిపూడి డ్యాన్స్ వంటి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

సంస్కృత భాష ప్రాధాన్యంపై ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కశింకోట: కన్నూరుపాలెంలో సంస్కృత శిక్షణ బాల కేంద్రం ఆధ్వర్యంలో సంస్కృత భాష ప్రాధాన్యంపై సోమవారం విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు సంస్కృత సప్తాహలో భాగంగా జరిగిన కార్యక్రమంలో విద్యార్థులతో భగవద్గీత, సంస్కృత భాష పరిచయం, అభ్యాసం, అభినయ గీతాలు, శ్లోకాలు పఠనం, కథలు చెప్పడం వంటివి నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్కృత భారతి ప్రాంత సంపర్క ప్రముఖ్ రామకుమార్ విశిష్ట అతిథిగా మాట్లాడుతూ కన్నూరుపాలెం సంస్కృత గ్రామంగా రూపుదిద్దుకోవాలని ఆకాంక్షించారు. బాల బాలికలకు గీత హైస్కూలు కరస్పాండెంట్ అన్నారావు జ్ఞాపికలను అందజేశారు. సంస్కృత శిక్షణ బాల కేంద్రం నిర్వాహకురాలు గాయత్రీదేవి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రిటైర్డు సీహెచ్‌వో శోభాదేవి, రిటైర్డు హెచ్‌ఎం ముత్యాలు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ప్రతిష్ట మహోత్సవం



ప్రత్యేక అలంకరణలో గౌరీపరమేశ్వరుల అమ్మవారు



అమ్మవారి ఆలయం వద్ద అన్నసమారాధన

అనకాపల్లి: స్థానిక గవరపాలెం గౌరీపంచాయతన దేవాలయంలో గౌరీపరమేశ్వరుల అమ్మవారి ప్రతిష్ట(వార్షికోత్సవం) మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి క్షీరాభిషేకం, పంచామృత అభిషేకాలు, అమ్మవారి ప్రత్యేక అలంకరణ, ఆలయ మండపంలో దంపతులతో సామూహిక కుంకుమ పూజలు వంటి అనేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆలయానికి వచ్చే భక్తులకు మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామసత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్ పాల్గొన్నారు.

మొల్లేటి గెడ్డలో ఫార్మా వ్యర్థాలతో ప్రజలకు ఇక్కట్లు



మొల్లేటి గెడ్డలో నిలిచిపోయిన రసాయన వ్యర్థ జలాలను చూపుతున్న గనిశెట్టి

పరవాడ: భర్నికం సమీపంలోని మొల్లేటి గెడ్డలో నిలిచిపోయిన ఫార్మా రసాయన వ్యర్థజలాలను వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మొల్లేటి గెడ్డలో నిలిచిన రసాయన వ్యర్థ జలాలను ఆయన సోమవారం పరిశీలించారు. అనంతరం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మొల్లేటి గెడ్డలోకి ఫార్మా రసాయన వ్యర్థ జలాలను విడుదల చేస్తున్న ఫార్మా పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గెడ్డలో నిలిచిపోయిన వ్యర్థ జలాలను పరిశీలించిన పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు సంబంధిత యాజమాన్యాలకు నోటీసులిచ్చి చేతులు దులిపేసుకున్నారే తప్ప, ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాల్లేవని ఆరోపించారు. రసాయన వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా వదిలిపెట్టడంతో భూగర్భ జలాలు కలుషితం కావడమే కాకుండా పర్యావరణం దెబ్బతింటుందన్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఫార్మా పరిశ్రమల యాజమాన్యాలపై పీసీబీ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫార్మా పరిశ్రమల కాలుష్యంతో ఇబ్బంది పడుతున్న పరవాడ, భర్నికం, తానాం, తాడి, లంకెలపాలెం, సాలాపువానిపాలెం, ఈ బోనంగి గ్రామాల ప్రజలను ఆదుకోవాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.

ఆపరేషన్ థియేటరా? డైనింగ్ హాలా?

రేగుపాలెం పీహెచ్‌సీ ఓటీలో సిబ్బంది భోజనాలు



ఆపరేషన్ థియేటర్‌లో సోమవారం మధ్యాహ్నం భోజనాలు చేస్తున్న సిబ్బంది



రేగుపాలెం పీహెచ్‌సీ శస్త్ర చికిత్సలు చేసే టేబుల్‌పై ఉంచిన ఆహార పదార్థాలు

యలమంచిలి రూరల్: ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం పరాకాష్టకు చేరుతోంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణా లోపం, తెలిసినా ఏం చేస్తారులే అన్న ధీమా వెరసి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. యలమంచిలి మండలం రేగుపాలెం పీహెచ్‌సీలో కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేసే ఆపరేషన్ థియేటర్‌ను అక్కడ సిబ్బంది ఏకంగా డైనింగ్ హాల్‌గా మార్చేశారు. రోజూ ఈ ఆస్పత్రి ఓటీలో సిబ్బంది దర్జాగా మధ్యాహ్న భోజనాలు చేయడానికి వినియోగిస్తున్నారు. ఓటీలో ఏసీ వేసుకుని కబుర్లు చెప్పుకుంటూ భోజనాలు చేస్తున్నా ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ ఏమాత్రం పట్టించుకోవడంలేదు. ఆస్పత్రుల్లో శస్త్ర చికిత్సలు చేసే గదుల నిర్వహణ ప్రత్యేకంగా ఉంటుంది. క్రిమిరహితంగా ఉండేలా రోజూ ప్రత్యేకమైన పద్ధతుల్లో ఓటీని శుభ్రపరచాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ సిబ్బంది భోజనాలు చేయడానికి వినియోగిస్తుండటం చర్చనీయాంశమవుతోంది. గతంలో ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్లు చేయించుకున్న వారిలో ఇద్దరికి ఇన్‌ఫెక్షన్ సోకిన సందర్భాలున్నాయి. అయినప్పటికీ ఆస్పత్రి వైద్యులు, సిబ్బందిలో మార్పు రాకపోవడానికి ఉన్నతాధికారుల ఉదాసీనతే కారణంగా తెలుస్తోంది.

అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న పొక్లెయిన్, లారీల సీజ్

సబ్బవరం: మండలంలోని పైడివాడ గ్రామంలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేపడుతూ తరలిస్తున్న పొక్లెయిన్, రెండు లారీలు సీజ్ చేసినట్లు తహసీల్దార్ చిన్నికృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైడివాడ సర్వే నెం.164 కొండ పోరంబోకు భూమిలో సోమవారం అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్నట్లు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు ఆర్ఐ వీరయ్య, వీఆర్వో దేముడుబాబుతో కలిసి గ్రావెల్ తవ్వుతున్న పొక్లెయిన్, గ్రావెల్ తరలిస్తున్న రెండు లారీలను పట్టుకుని, సీజ్ చేసి, వాటిని పోలీస్‌లకు అప్పగించామన్నారు. పొక్లెయిన్ ఆపరేటర్ గుర్రాల రాజు(35), లారీ డ్రైవర్లు బొట్టా ముసలినాయుడు(55), బొట్టా సన్యాసిరావు(38)లపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. తదుపరి చర్యలు నిమిత్తం మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.

ఆర్టీఐ యాక్టుపై అవగాహన



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న లచ్చన్న

అనకాపల్లి: జిల్లాలో ప్రకృతి వ్యవసాయంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు అధికారి లచ్చన్న తెలిపారు. మండలంలో తుమ్మపాలలో రైతు సాధిక సంస్థ కార్యాలయంలో సోమవారం ఆర్టీఐ యాక్టుపై రైతులకు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై యువత ముందుకు రావాలని కోరారు. ప్రకృతి వ్యవసాయంతో పండించిన ఉత్పత్తులు రోజూ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో మార్కెటింగ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ గోవింద్, మార్కెటింగ్ అప్పలరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

బల్క్‌డ్రగ్ పార్క్‌కు భూములిచ్చేది లేదు

నక్కపల్లి: మండలంలోని రాజయ్యపేట సమీపంలో ఏపీఐఐసీ వారు ఏర్పాటు చేస్తున్న బల్క్ డ్రగ్ పరిశ్రమలకు భూములిచ్చేది లేదని సీహెచ్ఎల్‌పురం, జానకయ్యపేట, పెదతీనార్ల గ్రామాల రైతులు స్పష్టం చేశారు. సోమవారం వీరంతా వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, సీపీఎం నాయకుడు ఎం అప్పలరాజుల ఆధ్వర్యంలో కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్‌లను వేర్వేరుగా కలసి వినతి పత్రాలు అందజేశారు. బల్క్‌డ్రగ్ పార్క్ ఫేజ్ 2 కోసం అదనంగా 700 ఎకరాలు భూములు సేకరించేందుకు ప్రభుత్వం 6ఏ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 6న ప్రజాభిప్రాయ సేకరణలో మత్స్యకారులు నిరసన తెలిపారు. నర్సింహమూర్తి, అప్పలరాజు మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలంతా భూములనే నమ్ముకుని జీవిస్తున్నారన్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో పరిశ్రమల ఏర్పాటును వ్యతిరేకించిన రైతుల అభిప్రాయాలు, ఆందోళనల వీడియో క్లిప్పింగ్‌లు తారుమారు చేయకుండా యథావిధిగా కేంద్ర ప్రభుత్వానికి పంపించాలన్నారు. నూటికి 95 శాతం మంది వ్యతిరేకించారన్నారు. ప్రాణాలిచ్చయినా భూములను కాపాడుకుంటామని, ప్రభుత్వం విడుదల చేసిన 6ఏ నోటీసులు ఉపసంహరించుకోవాలని కోరారు. పచ్చటి పొలాలను ప్రమాదకర రసాయన పరిశ్రమల కోసం తీసుకుని ఈ ప్రాంతాలను కలుషితం చేయొద్దని కోరారు.

రాఘవేంద్ర స్వామి సేవలో వార్డు కార్పొరేటర్



రాఘవేంద్రస్వామిని దర్శించుకున్న కార్పొరేటర్ సునీత జానకీరామరాజు దంపతులు

అనకాపల్లి: స్థానిక వేల్పులవీధి రాఘవేంద్ర స్వామి 354వ ఆరాధన మహోత్సవాలు సందర్భంగా స్వామివారిని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత జానకీరామరాజు దంపతులు సోమవారం రాత్రి దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, పార్టీ నాయకులు కడిమిశెట్టి సతీష్, బొండా శంకరరావు, గుండా గుప్తా, వేల్పుల గణేష్, కొంకి శ్రీరామూర్తి, బొండా వాసు, దొంక సత్తిబాబు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్ సమస్య పరిష్కరించాలి



జోనల్ కమిషనర్ చక్రధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జాజుల రమేష్

అనకాపల్లి: అమృత స్కీమ్ తాగునీటి పైపులైన్ సమస్యలను పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ కోరారు. స్థానిక జోనల్ కార్యాలయంలో జెడ్సీ చక్రధర్‌కు సోమవారం ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జోన్ పరిధిలో ఇంటింటికి తాగునీటి కుళాయిలు, అమృత స్కీమ్ నిధులతో వేసిన మంచినీటి పైపులైన్లు పాడై నీటి సమస్య ఉత్పన్నమైందన్నారు. ఇంటి, కుళాయి పన్నులను వసూలు చేస్తున్న జీవీఎంసీ అధికారులు, దీనిపై నిర్లక్ష్యం ఉండటం అన్యాయమన్నారు. కొన్ని ప్రాంతాల్లో తాగునీటి పైపులైన్ల ద్వారా మురుగు వస్తుందని, వాటిని తాగిన ప్రజలు వివిధ రకాల వ్యాధులు బారినపడుతున్నట్లు వాపోయారు. ప్రజలు ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని పరిశుభ్రమైన తాగునీరు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నడిశెట్టి మధు, పార్టీ నాయకులు కొడుకుల సుబ్రహ్మణ్యం, నడిశెట్టి గోవింద్, తంగేళ్ల రామకృష్ణ, కోన ఉమ, రెడ్డి చిన్న, చింతా రాంజీ, మేడిశెట్టి గణేష, తదితరులు పాల్గొన్నారు.

ఎండీఎం కార్మికులకు కనీస వేతనాలివ్వాలి



పాఠశాలలో ఆందోళన చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

పరవాడ: మధ్యాహ్న భోజన పథకం(ఎండీఎం) కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని మండల ఎండీఎం కార్మిక సంఘం అధ్యక్షులు కె.ఆదిలక్ష్మి డిమాండ్ చేశారు. ఈ మేరకు వాడచీపురుపల్లి జెడ్పీ హైస్కూల్లో ఐద్వా ఆధ్వర్యంలో ఎండీఎం కార్మికులు సోమవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఆదిలక్ష్మి మాట్లాడుతూ పాఠశాలలో 18 ఏళ్లుగా 8 మంది కార్మికులు వంట పని చేస్తున్నప్పటికీ వారిలో నలుగురికి మాత్రమే నెలకు రూ.3 వేలు చొప్పున వేతనం అందిస్తున్నారని పేర్కొన్నా రు. ఆ నలుగురికి వచ్చిన వేతనాన్ని 8 మంది పంచుకుంటున్నట్లు తెలిపారు. ఈ పరిస్థితి జిల్లాలో అనేక పాఠశాలల్లో జరుగుతోందన్నారు. బయట కూలి పనులకు వెళితే ఒక్కొక్కరికి రోజుకి రూ.600 చెల్లిస్తున్నారని, పాఠశాలల్లో వంట పని వారి ఇబ్బందులను మాత్రం ప్రభుత్వం పట్టించుకోవట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు బియ్యం, గుడ్లను మాత్రమే ప్రభుత్వం సరఫరా చేస్తుందని, మిగిలిన వంట సామగ్రి కొనుగోలుకు అప్పులు చేయాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం బిల్లులు చెల్లించే వరకు చేసిన అప్పులకు వడ్డీలు కట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనంతో పాటు యూనిఫారం, ఐడెంటిటీ కార్డు, ఆస్పత్రి సదుపాయం కల్పించాలని ఆదిలక్ష్మి డిమాండ్ చేశారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం, జి.లక్ష్మి, కె.రత్నకుమారి, పి.నాగమణి, గాజుల సత్యవతి, కె.పైడితల్లి, ఎ.నూకరత్నం, లక్ష్మి పాల్గొన్నారు.

అక్రమ గ్రావెల్ తవ్వకాలపై ఫిర్యాదు



గ్రావెల్ తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్తులు

అచ్యుతాపురం రూరల్: మడుతూరులో బోడికొండ సర్వే నంబర్ 285లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలపై గ్రామస్తులు మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. సోమవారం తెల్లవారు నుంచి అనధికారంగా ఏర్పాటు చేసిన మూడు క్వారీ లారీలు, ఒక జేసీబీతో గ్రావెల్ తవ్వకాలు చేపట్టగా అడ్డుకున్నారు. గతంలోనూ ఇదేవిధంగా చేపట్టిన గ్రావెల్ తవ్వకాలపై చర్యలు తీసుకోకపోవడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారని వాపోయారు. కూటమి నాయకులు అండదండలతో అక్రమంగా గ్రావెల్ తరలించుకుపోతున్నారని ఆరోపించారు. ఇక్కడ కొండను ఆనుకుని ఐదెకరాల విస్తీర్ణంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉందన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించి పాఠశాలతోపాటు దిగువ ప్రాంతాల్లో గ్రామాలకు ముప్పు పొంచే అవకాశం ఉందని వాపోయారు. అధికారులు స్పందించి పాఠశాలను, ప్రభుత్వ ఆస్తులను, పర్యావరణాన్ని కాపాడాలని కోరారు.